క్లుప్తంగా

కమనీయం.. శ్రీవారి కల్యాణం



శ్రీవారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పుల్‌కల్(అందోల్): సింగూరులో వెలిసిన సుందర వేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతి ఏటా మాఘ శుద్ధ చవితి నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో రెండో రోజు స్వామివారి కల్యాణం జరిపిస్తారు. ఈ ఆలయం నీటి పారుదల శాఖ అధీనంలో ఉండటంతో ఆశాఖ ఇంజినీర్లు కల్యాణంలో పాల్గొన్నారు. శ్రీవారి వధూవరుల తరపున ఇంజినీర్‌లే పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. కల్యాణంలో వందకు పైగా జంటలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాదయాత్ర



పల్లకీ సేవతో సరస్వతీ ఆలయ ఉత్సవాలకు పాదయాత్రగా వెళ్లిన భక్తులు

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామానికి చెందిన భక్తులు న్యాల్‌కల్ మండలం రాఘవాపూర్‌లోని సరస్వతీ ఆలయ ఉత్సవాలకు పాదయాత్రగా బయలుదేరారు. పల్లకి మోస్తూ రాయికోడ్, చీమ్నపూర్, కూసునూర్ గ్రామాల మీదుగా భజన చేస్తూ సరస్వతీ దేవి పాటలు ఆలపిస్తూ ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో భక్తులు నాగయ్య, రాజు, అనిల్‌చారి, మహిళలు పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధి కాలనీల్లో పార్కుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ పుష్ప పేర్కొన్నారు. సోమవారం కాకతీయనగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాకతీయనగర్ కాలనీలో థీమ్ పార్కును అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై గతకొద్ది రోజుల క్రితం హెచ్‌ఎండీఏ అధికారులను కలిశామన్నారు. అందులో భాగంగా సంబంధిత అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పర్యటన చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలనీవాసులు నరేందర్‌బాబు, ప్రభాకర్ రెడ్డి, రాములు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం శివానగర్ గ్రామంలో సోమవారం మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మల్లన్న దయతో నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

అందుబాటులోకి 108 సేవలు



గుమ్మడిదలలో 108 వాహనం, సిబ్బంది

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రభుత్వం మంజూరు చేసిన అంబులెన్స్ 108 వాహనం, సిబ్బంది సోమవారం నుంచి అందుబాటులోకి వచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో మెదక్ బాలానగర్ ప్రధాన రహదారి ఉండటంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. స్థానికంగా 108 సేవలు అందుబాటులో లేనందున ప్రమాదాలకు గురైన వారు మార్గమధ్యలోనే మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. 108 సేవలు అందుబాటులోకి రావడంతో రోడ్డు ప్రమాదాలు సంభవించిన సకాలంలో ఆస్పత్రికి తరలించి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

అసంపూర్తిగా ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు

- రెండు నెలల నుంచి ట్రాఫిక్ మళ్లింపు
- అవస్థలు పడుతున్న ప్రజలు



కొనసాగుతున్న బ్రిడ్జి రోడ్డు పనులు

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో ప్రధాన రహదారి రైల్వేగేటు వద్ద చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డు పనులు పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నెలరోజుల్లో మిగులు పనులు పూర్తి చేసి ఫ్లైఓవర్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకోస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు పేర్కొన్నారు. గడువు దాటినా ఇంకా పనులు కొనసాగుతున్నాయి. ట్రాఫిక్‌ను అల్లాన రోడ్డుగుండా మళ్లించడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

జహీరాబాద్ పట్టణం గుండా 65వ జాతీయ రహదారి వెళ్తోంది. రోడ్డు మధ్యలో పట్టణ సమీపంలో రైల్వే గేటు ఉంది. రైళ్ల రాకపోకల సమయంలో గేటు వేయడం వల్ల ప్రతిసారి వాహనాలు ఆగాల్సి వస్తుంది. వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో రైలు వచ్చినప్పుడు ట్రాఫిక్ జాం అవుతోంది. ట్రాఫిక్ సమస్య నివారణకు రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ఎమ్మెల్యే మాణిక్‌రావు మాజీ మంత్రి హరీశ్‌రావును కోరుతూ వచ్చారు. ఆయన కృషి వల్లే బీఆర్‌ఎస్ హయాంలో రూ. 90 కోట్ల నిధులను మంజూరయ్యాయి. ఆరు సంవత్సరాల క్రితం బ్రిడ్జి పనులకు శ్రీకారం చుట్టారు. ఆయా కారణాలతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. 90 శాతం పనులు పూర్తయిన తరువాత బిల్లులు రాని కారణంగా కాంట్రాక్టర్ పనులు నిలిపేశారు. ఈ విషయాన్ని స్థానిక మంత్రులు దామోదర రాజనర్సింహ్మ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రుల కృషి వల్ల రెండు నెలల కిందట బిల్లులు విడుదల కావడంతో కాంట్రాక్టర్ పనులు తిరిగి ప్రారంభించారు. బీదర్ చౌరస్తా నుంచి మొగుడంపల్లి చౌరస్తా వరకు సీసీరోడ్డు, వాగు పైన బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తి చేశారు. కానీ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు ఇంకా పనులు కొనసాగుతున్నాయి. ఇచ్చిన గడువు దాటి రెండు నెలలు అవుతున్నా పనులు పూర్తి కాలేదు. బీదర్, ముంబాయి, మహీంద్రా అండ్ మహీంద్రా, చిరాగ్‌పల్లి, మొగుడంపల్లి వైపు వేళ్లె వాహనాలను బైపాస్, అల్లాన గుండా దారి మళ్లించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు బ్రిడ్జి పనులు పూర్తి చేసి కష్టాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కోడ్‌తో పథకాలను ఆపేందుకు కుట్ర

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



ఎమ్మెల్యేను కలిసిన మాజీ కౌన్సిలర్లు

సంగారెడ్డి: పనులన్నింటిని పెండింగ్ వేస్తూ.. ఫండింగ్ చేసుకుంటూ ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేయడం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయనను మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వంలో ఎస్‌డీఎఫ్ నిధులు సంగారెడ్డి పట్టణానికి రూ.50 కోట్లు, సదాశివపేట మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం మారడంతో సంగారెడ్డి పట్టణంలో పలు అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పట్టణాల అభివృద్ధిని అడ్డుకోకుండా క్యాన్సిల్ చేసిన పనులను మళ్లీ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ పేరుతో సంక్షేమ పథకాలను ఆపేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. జనవరి 26 తరువాత రైతు భరోసా డబ్బులు ఖాతాలో పడతాయని రైతులు ఎదురు చేస్తున్నారు. ఇప్పటి వరకు రైతుల ఖాతాలో డబ్బులు జమ కాలేదన్నారు. కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, విఠల్ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొగాకు రహిత జిల్లాగా మారుద్దాం

పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు

పటాన్‌చెరు టౌన్: పొగాకు రహిత జిల్లాగా మారుద్దామని పొగాకు నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని భానూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పొగాకు నియంత్రణపై అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... బస్టాండ్, మార్కెట్, విద్యా సంస్థల తదితర ప్రదేశాల్లో పొగాకు వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. యువత పొగాకు, గుట్కా, తంబాకు, జర్దా, పాన్ మసాలా, సిగరెట్‌కు చిన్న వయస్సులోనే అలవాటు పడి, క్యాన్సర్, గుండె జబ్బులు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు వాడకలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పెంటయ్య, సుజాత, మంగ తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు

మునిపల్లి(అందోల్): రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులు ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. సోమవారం మండలంలోని కంకోల్, పెద్దచల్మెడ, చిన్నచల్మెడ, మునిపల్లి, పెద్దలోడి గ్రామాల్లో పంటల సాగు వివరాలను రైతుల నుంచి సేకరించే కార్యక్రమం ప్రారంభించారు. ఎన్ని ఎకరాల్లో పంటల సాగు చేస్తున్నారనే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారులు లావణ్య, రహిమాన్, అంజన్న, స్నేహ, నిఖితలు తెలిపారు. రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

విగ్రహాలకు ముసుగు పడింది..

సాక్షి ఎఫెక్ట్..



దౌల్తాబాద్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహం

హత్నూర (సంగారెడ్డి): సాక్షి దిన పత్రికలో సోమ వారం ప్రచురితమైన కోడ్ వచ్చింది.. ముసుగు వేయరా? కథనానికి మండల అధికారులు స్పందించి వెంటనే జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేయించారు. హత్నూర గ్రామంలోని బాబు జగ్జీవన్‌రామ్, దౌల్తాబాద్‌లోని స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ విగ్రహాలకు ముసుగు వేయించినట్లు ఎంపీఈఓ యూసుఫ్ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడ కూడా నాయకుల ఫ్లెక్సీలు ఉన్నా తీసేస్తామన్నారు.

టీచర్, సీడీపీఓలపై సస్పెన్షన్ ఎత్తివేయండి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు



చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలో అడిషనల్ కలెక్టర్, ఐసీడీఎస్ పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ..అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేదు. ప్రైమరీ స్కూల్ కోసం 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనంలో కొనసాగుతుందన్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించారని తెలిపారు. 2 సంవత్సరాల క్రితం లక్షా 50 వేలతో కాంట్రాక్టర్ లోపలి పైకప్పుకు మరమ్మతులు చేశారు. కాని, నాసిరకం పనుల వల్ల పైకప్పు పెచ్చులు పడిపోయాయని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్, సీడీపీఓపై సస్పెన్షన్ ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మాణిక్యం యూనియన్ జిల్లా కార్యదర్శి మంగ, నారాయణఖేడ్ డివిజన్ సీఐటీయూ కార్యదర్శి రమేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



జహీరాబాద్ టౌన్: బీసీ కుల సంఘాల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని బాగారెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా వడ్డె దశరథ్, ఉపాధ్యక్షుడిగా గొల్లశివ, జితేందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శిగా వడ్డె వెంకట్, సహాయ కార్యదర్శిగా వడ్డె ప్రభు, కోశాధికారిగా వడ్డె కృష్ణ, కార్యవర్గ సభ్యుడిగా వడ్డెనవీన్, సత్పాల్‌సింగ్, మోహన్ ఎన్నికయ్యారు. ఎన్నికల కమిటీ నిర్వాహకులుగా కొండాపురం నర్సింలు, డాక్టర్ పెద్దగొల్ల నారాయణ వ్యవహరించారు.

డ్రైవర్‌కు సన్మానం

మునిపల్లి(అందోల్): రోడ్డు యాక్సిడెంట్, హిట్ అండ్ రన్ కేసుల్లో పోలీసులకు సహకారం అందించిన డ్రైవర్‌కు బుదేరా ఎస్ఐ రాజేశ్ నాయక్ శాలువా కప్పి సన్మానించారు. సోమవారం మండలంలోని బుదేరా పోలీస్ స్టేషన్‌లో మండలంలోని మగ్దుంపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ ఇంతియాజ్ కారు డ్రైవర్‌ను సన్మానించడంతో పాటు నగదు, పారితోషికం అందజేశారు. గంజాయి, చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసిన వారి వివరాలు పోలీసులకు సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు చెప్పారు. 8712656749 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్ఐ రాజేశ్‌నాయక్ కోరారు.

కంగ్టిలో తగ్గిన ఎంపీటీసీ స్థానం



ఎంపీటీసీ స్థానాల తుది జాబితాను ప్రదర్శించిన ఎంపీడీఓ, ఎంపీఓ

కంగ్టి(నారాయణఖేడ్): మండల స్థాయి ప్రాదేశిక నియోజకవర్గాల (ఎంపీటీసీ) తుది జాబితాను సోమవారం విడుదల చేసినట్లు ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కంగ్టి మండలంలో గత ఎన్నికల్లో 13 ఎంపీటీసీ స్థానాలు ఉండగా ప్రస్తుతం 12 ఎంపీటీసీ స్థానాలు మాత్రమే ఉన్నట్లు పేర్కొన్నారు. తుది జాబితాలో భీంరా, దెగుల్‌వాడి, తుర్కవడ్‌గాం, ఎన్కెమూరి, గాజుల్‌పాడ్, సుక్కల్‌తీర్థ్, జమ్గి(బీ), దామర్‌గిద్దా, చాప్టా(కే), తడ్కల్, కంగ్టి, బోర్గి స్థానాలు ఉండగా బాబుల్‌గాం ఎంపీటీసీ స్థానం తొలగించినట్లు తెలిపారు. జిల్లాల విభజన సమయంలో నిజామాబాద్ జిల్లాలో ఉన్న బాబుల్‌గాంను సంగారెడ్డి జిల్లాలో కలిపారు. గత ఏడాది కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలంలో బాబుల్‌గాం గ్రామపంచాయతీని విలీనం చేశారు. రెవెన్యూ రికార్డులు మార్చినా.. ఇప్పటికి బాబుల్‌గాం గ్రామపంచాయతీ కంగ్టి మండలంలోనే కొనసాగుతోంది. ఎంపీటీసీ నియోజకవర్గం జాబితా నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ కమిషనర్ జైత్రం నాయక్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బజరంగ్, బాబురావు, అరుణ్ పాల్గొన్నారు.

బైపాస్‌కు ఇరువైపులా ఆక్రమణలు



పలు దుకాణాల వద్ద నిలిపిన వాహనాలు

సంగారెడ్డి క్రైమ్: సంగారెడ్డి పట్టణంలో ప్రధాన మార్గాల్లో బైపాస్ రోడ్డు ఒకటి. బైపాస్ రోడ్డులో మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి బసవేశ్వర విగ్రహం వరకు 80 అడుగుల రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయాయి. ఇదే అనువుగా భావించిన కొందరు వ్యాపారాలు రోడ్డుకు ఇరువైపుల డబ్బాలు ఏర్పాటు చేసి వ్యాపారం నిర్వహిస్తున్నారు. ప్రధాన రోడ్డు విస్తరణ రోజురోజుకు మరింత ఆలస్యం కావడంతో పలు దుకాణల వద్ద వాహనదారులు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో పాఠశాల విద్యార్థులు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పురపాలక శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

వసంత పంచమిని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆలయాలు, పాఠశాలల్లో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా పాఠశాలలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో చిన్నారులకు తల్లిదండ్రులు అక్షరాభ్యాసం చేయించారు. పూజల్లో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రామచంద్రాపురం: భెల్ టౌన్‌షిప్‌లోని సరస్వతీ దేవి ఆలయంలో..



సంగారెడ్డి: సరస్వతీ దేవి అలంకరణలో దుర్గాభవాని మాత..



సంగారెడ్డి: సరస్వతీ దేవి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



సదాశివపేటలో..

కనులపండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

హత్నూర (సంగారెడ్డి): మండలం పరిధి సిరిపురం గ్రామంలోని మాతా మాణికేశ్వరి ఓంకారేశ్వర ఆశ్రమం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వాహకులు సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆశ్రమంలోని గోశాలలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన మందిరంలో మాతా మణికేశ్వరి పాదుకాపూజ చండీహోమం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పీఠాధిపతి దేవదాసు స్వామిజీతో పాటు హత్నూర, చిలిపిచేడ్, కొడిపల్లి మండలాలకు చెందిన వివిధ గ్రామాల శివ స్వాములు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దౌల్తాబాద్‌లోని భవాని స్ఫటిక లింగేశ్వర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సుప్రభాతసేవ, గణపతి హోమం, స్ఫటిక లింగేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అగ్నిగుండాలు జాతర బండ్లను ఊరేగించారు.

బీఆర్‌ఎస్ కృషితో ఎస్‌టీపీ ప్లాంట్‌కు నిధులు

తెల్లాపూర్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గత బీఆర్‌ఎస్ మున్సిపల్ పాలకవర్గం కృషితోనే తెల్లాపూర్‌లో రూ.60కోట్లతో ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి ఆమోదం లభించిందని తెల్లాపూర్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు దేవేందర్ యాదవ్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 2021లో అధికార పార్టీలో ఉన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్‌టీపీ ఏర్పాటు కోసం కోర్టును ఆశ్రయించిందన్నారు. దాని ఫలితంగానే ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి నిధులు వచ్చాయని తెలిపారు. గతంలోనే ప్లాంట్ ఏర్పాటుకు అధికారులు స్థలాన్ని కూడా చూశారు. కాంగ్రెస్, బీజేపీ వల్ల ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణానికి నిధులు రాలేదని వివరించారు. నిధులు సాధించిన బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లలితరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రాములుగౌడ్, మాజీ కౌన్సిలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బాలాజీ, నాగరాజు, శ్రీశైలం, మాజీ కోఆప్షన్ సభ్యులు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు సాగర్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశ్, మోహన్ పాల్గొన్నారు.

వార్డు ప్రజలకు రుణపడి ఉంటా

మాజీ కౌన్సిలర్ నసీరుద్దీన్



నసీరుద్దీన్‌ను సన్మానిస్తున్న ప్రజలు

సదాశివపేట(సంగారెడ్డి): వార్డు ప్రజలందరికీ రుణపడి ఉంటానని నాల్గొవ వార్డు మాజీ కౌన్సిలర్ నసీరుద్దీన్ పేర్కొన్నారు. సోమవారం వార్డు ప్రజలు మాజీ కౌన్సిలర్ నసీరుద్దీన్‌ను శాలువా పూలమాలతో సత్కరించి సన్మానించారు. ఐదేళ్లపాటు వార్డు ప్రజలందరి సహకారంతో సీసీ డ్రైయిన్లు, రహదారులు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా వంటి సమస్యలను పరిష్కరించానని అన్నారు. కార్యక్రమంలో నర్సింలు, బాబేష్, కరీం, కామీల్, రహమత్, మోసిన్, ఖదీర్, మహబుబ్, షారు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని నిరసన



విసతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు సోమవారం ఎంపీపీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీ యూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ.. నాలుగు నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు అందక కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలతో పాటు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, జయరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు భరోసా జమ చేయాలి

సంగారెడ్డి టౌన్: రైతుభరోసా నిధులు రైతు ఖాతాల్లో జమ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులు, రెండు లక్షల రుణ మాఫీ పూర్తిగా మాఫీ కాలేదని వెంటనే అమలు చేయాలన్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగాయి.. పంటలకు మద్దతు ధర కల్పించాలని కోరారు.